సాక్షి
ఖమ్మం

ఆదివారం । 29 । జూన్ । 2025



విజ్ఞాన గని..

ఎందరో విద్యార్థులను ఉద్యోగులుగా, మేధావులుగా తీర్చిదిద్దిన వేదికగా కారేపల్లిలోని శాఖా గ్రంథాలయం పేరు గడించింది. 8లో



ఆయిల్ రికవరీని కాపాడాలి

ఆయిల్‌పాం ఫ్యాక్టరీలో ఆయిల్ రికవరీని కాపాడాలని ఆయిల్‌ఫెడ్ ఈడీ ప్రశాంత్ కుమార్ సిబ్బందికి సూచించారు. 8లో

గరిష్టం / కనిష్టం
34° / 25°

వాతావరణం

జిల్లాలో ఆదివారం ఆకాశం మేఘావృతమై చల్లటి గాలులు వీస్తాయి. సాయంత్రం తర్వాత కొన్నిచోట్ల జల్లులు పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

శ్రీ వేంకటేశ్వరస్వామి వారికి ప్రత్యేక పూజలు



క్యూలైన్ ద్వారా స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

ఎర్రుపాలెం: తెలంగాణా తిరుపతిగా ప్రసిద్ధి గాంచిన జమలాపురం శ్రీ వేంకటేశ్వరస్వామి వారికి శనివారం అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీవారి పాదానికి, శ్రీ స్వామివారి విగ్రహానికి వేదమంత్రాలతో శాస్త్రోక్తంగా పంచామృతాభిషేకం చేశారు. శ్రీవారిని, శ్రీఅలివేలు మంగ, శ్రీపద్మావతి అమ్మవార్లను సుందరంగా అలంకరించి నిత్య కల్యాణం జరిపించగా.. భక్తులు కనులపండువగా తిలకించారు. ఆ తర్వాత శ్రీవారికి పల్లకీ సేవ గావించారు. తెలుగు రాష్ట్రాల భక్తులు భారీగా హాజరై శ్రీ వారిని దర్శించుకుని మొక్కులు సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ జగన్మోహన్‌రావు, వ్యవస్థాపక ధర్మకర్త ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, ప్రధానార్చకులు ఉప్పల శ్రీనివాసశర్మ, సూపరింటెండెంట్ విజయకుమారి, అర్చకులు రాజీవ్‌శర్మ, మురళీమోహన్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

డీఎంహెచ్‌ఓ కళావతిబాయి



పల్లె దవాఖానాను తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌ఓ కళావతిబాయి

చింతకాని : విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ కళావతి బాయి సిబ్బందిని హెచ్చరించారు. మండలంలోని పాతర్లపాడు పల్లె దవాఖానాను శనివారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని, ఏఎన్‌ఎంలు, వైద్య సిబ్బంది స్థానికంగా ఉండాలని ఆదేశించారు. పల్లె దవాఖానాలో వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ పరిశుభ్రంగా ఉంచితే కేంద్ర ప్రభుత్వ అవార్డుకు ఎంపికయ్యే అవకాశం ఉందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం అధికారి రామారావు, మండల వైద్యాధికారి డాక్టర్ ఆల్తాఫ్, సీహెచ్‌ఓ వీరందర్, హెల్త్ సూపర్‌వైజర్ కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

డీపీఓ ఆశాలత వెల్లడి



రామన్నపాలెంలో జాబితా పరిశీలిస్తున్న డీపీఓ

మధిర/ ఎర్రుపాలెం: అర్హులైన వారందరికీ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తుందని జిల్లా పంచాయతీ అధికారి ఆశాలత అన్నారు. లబ్ధిదారుల సర్వేలో భాగంగా శనివారం ఆమె మధిర మండలం ఖాజీపురం, మాటూరు, ఎర్రుపాలెం మండలం రామన్నపాలెం గ్రామాల్లో పర్యటించారు. రామన్నపాలెంలో ఇప్పటికే రూపొందించిన జాబితాలోని అర్హుల పేర్లను సూపర్ చెక్ చేశారు. తొలివిడతలో ఇళ్లు మంజూరైన లబ్ధిదారుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆయా కార్యక్రమాల్లో ఎర్రుపాలెం ఎంపీడీఓ బి.సురేందర్‌నాయక్, ఎంపీఓ జి. శ్రీలక్ష్మి, శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

క్లినికల్ శిక్షణకు 11లోగా దరఖాస్తు చేసుకోవాలి



ఖమ్మంసహకారనగర్: ఇంటర్మీడియట్ ఎంపీహెచ్‌డబ్ల్యూ (ఫీమేల్) ఒకేషనల్ కోర్సులో క్లినికల్ శిక్షణకు జూలై 11 లోగా దరఖాస్తు చేసుకోవాలని డీఐఈఓ కె.రవిబాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 2020 తర్వాత ఉత్తీర్ణులైన వారికి ఏడాది పాటు క్లినికల్ శిక్షణ అందించనున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలోని తిరుమలాయపాలెం, సత్తుపల్లి, మధిర ఆస్పత్రుల్లో శిక్షణ తీసుకోవాల్సి ఉంటుందని, ఎంపికైన వారు ఆస్పత్రి పేరుతో రూ.1000 డీడీ చెల్లించాలని సూచించారు. గతంలో దరఖాస్తు చేసుకుని, ఎంపిక కాని వారు కూడా మళ్లీ దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఆసక్తి గల వారు తమ బయోడేటాతో రూ.10 పోస్టల్ స్టాంప్ అతికించిన సొంత చిరునామా కవర్, జిరాక్స్ సర్టిఫికెట్లను జత పరిచి కలెక్టరేట్‌లోని తమ కార్యాలయంలో అందించాలని సూచించారు.



ఆస్పత్రి కిటకిట..

ఖమ్మం జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రి శనివారం పేషెంట్లతో కిక్కిరిసిపోయింది. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి భారీగా తరలిరావడంతో ఓపీ కౌంటర్ ప్రాంగణం కిటకిటలాడింది. మధ్యాహ్నం 12 గంటల వరకూ ఇదే పరిస్థితి నెలకొనగా క్యూలో నిల్చున్న పలువురు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్

హాస్టల్లోనే అన్నీ..



తిరుమలాయపాలెంలోని ఎస్సీ వసతిగృహంలో నోట్ పుస్తకాలు, బ్యాగ్‌లతో విద్యార్థులు

ఎస్సీ వసతి గృహాల్లో విద్యార్థులకు సకల సౌకర్యాలు

- నోట్‌బుక్స్, బూట్లు, నాలుగు జతల యూనిఫామ్ అందజేత
- 3 వేల మంది విద్యార్థులకు ప్రీ మెట్రిక్‌లో వసతి
- కార్పొరేట్‌కు దీటుగా హాస్టళ్ల నిర్వహణ
- తల్లిదండ్రులపై భారం పడకుండా చదువులు

ఖమ్మంమయూరిసెంటర్: సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న వసతి గృహాల్లోని విద్యార్థులకు ప్రభుత్వం సకల సౌకర్యాలు కల్పిస్తోంది. విద్యార్థులు, వారి తల్లిదండ్రులపై ఎలాంటి భారం పడకుండా అన్నీ అందజేస్తోంది. ఆర్థిక ఇబ్బందులు, సామాజిక నేపథ్యంతో సంబంధం లేకుండా ప్రతి విద్యార్థి ఉన్నత విద్యను అభ్యసించేలా ఎస్సీ వసతిగృహాలను ఆధునీకీకరిస్తోంది. జిల్లా వ్యాప్తంగా 41 ప్రీ మెట్రిక్ వసతిగృహాల్లో సుమారు 3 వేల మంది విద్యార్థులు ప్రస్తుతం ఈ వసతి సౌకర్యాన్ని పొందుతున్నారు. కార్పొరేట్ పాఠశాలలకు ఏమాత్రం తీసిపోని విధంగా వసతిగృహాల నిర్వహణ, సౌకర్యాలు ఉన్నాయని అధికారులు చెబుతున్నారు.

సకల సౌకర్యాలతో..

ఎస్సీ వసతిగృహాల్లో చేరిన విద్యార్థులకు ప్రభుత్వం అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తోంది. కేవలం వసతి, భోజనంతో సరిపెట్టకుండా వారి విద్యా అవసరాలను పూర్తిగా తీరుస్తోంది. పాఠ్యపుస్తకాలతో పాటు సంవత్సరం పొడవునా అవసరమైన నోట్ బుక్స్‌ను ఉచితంగా సరఫరా చేస్తోంది. ఎస్సీ వసతిగృహాల్లో ఉంటూ 3వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు ఒక్కొక్కరికి 10 నుంచి 28 నోట్ పుస్తకాలు అందజేస్తున్నారు. దీంతో తల్లిదండ్రులపై ఆర్థిక భారం తగ్గిస్తున్నారు. వీటితో పాటు విద్యార్థులకు అవసరమైన బూట్లు, యూనిఫామ్, స్కూల్‌బ్యాగులు పంపిణీ చేస్తున్నారు. ఇప్పటికే నోట్ పుస్తకాలతో పాటు ఒక జత యూనిఫామ్ అందజేశారు. మరో మూడు జతల యూనిఫామ్‌ను జూలై నెలలో అందజేయనున్నట్లు అధికారులు వెల్లడించారు.

3 వేల మందికి..

జిల్లాలోని 41 ప్రీ మెట్రిక్ వసతిగృహాలు ఉండగా వాటిలో రెన్యువల్ విద్యార్థులు 2,100 మంది ఉన్నారు. ఈ ఏడాది ఇప్పటి వరకు 700 మంది కొత్తగా చేరారు. మరో 200 మంది వరకు చేరే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ఈ అంచనాలతో జిల్లా వ్యాప్తంగా మూడు వేల మంది విద్యార్థులకు సౌకర్యాలు కల్పించేలా ఎస్సీ అభివృద్ధి శాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. కొత్తగా వసతిగృహాల్లో చేరే విద్యార్థులకు నోట్ పుస్తకాలు, బూట్లు, యూనిఫామ్‌తో పాటు ప్లేట్లు, గ్లాసులు, పరుపులు కూడా అందించనున్నట్లు తెలిసింది.

నోట్ పుస్తకాలు అందజేశాం..



నూతన విద్యా సంవత్సరం ప్రారంభం రోజునే వసతిగృహాలకు నోట్ పుస్తకాలు అందజేశాం. హాస్టల్ నుంచి పాఠశాలకు వెళ్లే విద్యార్థి మొదటి రోజు నుంచే నోట్ బుక్స్ తీసుకెళ్లేలా ఏర్పాట్లు చేశాం. ఈ ఏడాది నాలుగు జతల యూనిఫామ్ అందజేయనున్నాం. వసతిగృహంలో చేరిన విద్యార్థికి ఎలాంటి అదనపు భారం పడకుండా సకల సౌకర్యాలు కల్పిస్తున్నాం.

– కస్తాల సత్యనారాయణ, ఎస్సీ డీడీ

ఒక్కో విద్యార్థికి అందించే నోట్ పుస్తకాల సంఖ్య..

తరగతి	3	4	5	6	7	8	9	10
నోట్ పుస్తకాలు	6	10	12	15	22	18	24	28

సాధారణ ప్రసవాలు పెంచాలి

- ఆస్పత్రిని పరిశుభ్రంగా ఉంచండి
- ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉండాలి..
- అధికారులకు కలెక్టర్ అనుదీప్ ఆదేశం



సత్తుపల్లి ప్రభుత్వాస్పత్రిలో వైద్యులతో మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

సత్తుపల్లి : ప్రభుత్వాస్పత్రిలో సాధారణ ప్రసవాలు పెంచాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. స్థానిక ప్రభుత్వాస్పత్రిని శనివారం ఆయన సందర్శించి వైద్యులకు పలు సూచనలు చేశారు. ఆస్పత్రికి వచ్చే వారితో సేవాభావంతో మెలగాలని, సమయపాలన పాటిస్తూ మెరుగైన వైద్యసేవలు అందించాలని సూచించారు. వైద్య సిబ్బంది సరిపడా ఉన్నారా అని సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లును అడిగి తెలుసుకున్నారు. అనంతరం రూ.34 కోట్లతో నిర్మించిన నూతన ఆస్పత్రి భవనాన్ని పరిశీలించారు. రూ.25 కోట్లతో నిర్మిస్తున్న నర్సింగ్ కళాశాల నూతన భవన నిర్మాణ పనులను తనిఖీ చేసి వచ్చే ఏడాది కల్లా అందుబాటులోకి తేవాలని ఆదేశించారు.

ఈ – పాస్‌తోనే ఎరువులు విక్రయించాలి..

రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. స్థానిక అగ్రోస్ రైతు సేవా కేంద్రాన్ని తనిఖీ చేసి, పురుగు మందులు, ఎరువులు, విత్తనాల వివరాలపై ఆరా తీశారు. ఈ-పాస్ మిషన్ ద్వారానే ఎరువులు విక్రయించాలని చెప్పారు. అధిక లాభాలు వచ్చే ఉద్యాన పంటలు సాగు చేసేలా రైతులను ప్రోత్సహించాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్లకు మట్టి, ఇసుక ఇబ్బందులు వస్తున్నాయని కొత్తూరు గ్రామ లబ్ధిదారులు కలెక్టర్ దృష్టికి తేగా మట్టి, ఇసుక ముందుగానే డంప్ చేసి తహసీల్దార్ కూపన్ల ద్వారా జారీ చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో కల్లూరు ఆర్డీఓ ఎల్.రాజేంద్రగౌడ్, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ రాజశేఖర్, పబ్లిక్‌హెల్త్ ఈఈ ఉమామహేశ్వరరావు, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ టి.సీతారాం, తహసీల్దార్ సత్యనారాయణ, కమిషనర్ కె.నర్సింహా, వైద్యులు సురేష్ నారాయణ, వసుమతీదేవి పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణంలో వేగం పెంచాలి..

పెనుబల్లి : ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో వేగం పెంచాలని కలెక్టర్ అనుదీప్ అన్నారు. పెనుబల్లి మండలం రామచందర్‌రావు బంజర్‌లో నిర్మాణ పనుల ను శనివారం ఆయన పరిశీలించారు. ప్రతి సోమవారం బిల్లులు చెల్లిస్తున్నామని తెలిపారు. ఇళ్లకు అవసరమైన ఇసుక, మట్టి లబ్ధిదారులకు ఉచితంగా అందేలా చూడాలని ఆర్డీఓ రాజేందర్ గౌడ్‌ను ఆదేశించారు. వ్యవసాయ సీజన్ ప్రారంభమైనందున విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచాలని అన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ కమల్‌పాషా, ఎంపీడీఓ అన్నపూర్ణ, ఆర్ఐ జగదీష్ పాల్గొన్నారు.

రాష్ట్రంలో ఆదర్శంగా నిలపాలి

ఖమ్మంవ్యవసాయం: జిల్లా వ్యవసాయ రంగాన్ని రాష్ట్రంలో ఆదర్శంగా నిలపాలని కలెక్టర్ అనుదీప్ అన్నారు. వ్యవసాయ, ఉద్యాన శాఖల పనితీరుపై శనివారం ఆయన సమీక్షించారు. ఎరువులు, విత్తనాల లభ్యత, రైతు భరోసా, రైతు బీమా, ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణం వంటి అంశాలపై మండలాల వారీగా చర్చించి సూచనలు చేశారు. ఆధునిక సాగు పద్ధతులు, పంటల మార్పిడి విధానంలో జిల్లా ముందంజలో ఉండాలని సూచించారు. విత్తనాలు నాణ్యంగా ఉండేలా చూడాలని, ఎక్కడా కల్తీ విత్తనాలు అమ్మకుండా చూడాలని అన్నారు. జిల్లాలో ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణం పెంచాలన్నారు. వరి వైపు మాత్రమే రైతులు మొగ్గు చూపకుండా లాభసాటి పంటలపై దృష్టి సారించేలా అవగాహన కల్పించాలని ఆదేశించారు. పొలాల మధ్యలో ఫిష్ పాండ్ అభివృద్ధితో లాభాల గురించి వివరించాలన్నారు. సమావేశంలో డీఏఓ ధనసరి పుల్లయ్య, ఇన్‌చార్జ్ ఉద్యానాధికారి ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన బోధన అందించాలి

విద్యాశాఖ ఆర్‌జేడీ సత్యనారాయణ రెడ్డి



జల్లేపల్లి పాఠశాలలో మొక్క నాటుతున్న సత్యనారాయణరెడ్డి

తిరుమలాయపాలెం: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యతతో కూడిన విద్యాబోధన అందించాలని వరంగల్ రీజినల్ జాయింట్ డైరెక్టర్ కె.సత్యనారాయణరెడ్డి ఉపాధ్యాయులకు సూచించారు. మండలంలోని ఏలువారిగూడెం, పాతర్లపాడు ప్రాథమిక పాఠశాలలు, బీరోలు, జల్లేపల్లి, తిరుమలాయపాలెం జిల్లా పరిషత్ పాఠశాలలను శనివారం ఆయన తనిఖీ చేశారు. విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్, నోట్ బుక్స్, మధ్యాహ్న భోజనం వంటి వాటిని పరిశీలించారు. పిల్లలకు నాణ్యమైన విద్య అందుబాటులో ఉందా లేదా అని ప్రతీ తరగతిలోకి వెళ్లి ఆరా తీశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బోధన, అభ్యసన ప్రక్రియలను సమర్థంగా నిర్వహించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు డిజిటల్ పరికరాలను ఉపయోగిస్తూ విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా బోధించాలని సూచించారు. ఈ సందర్భంగా జల్లేపల్లిలోని పీఎం శ్రీ పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఆయా కార్యక్రమాల్లో ఎంఈఓ శ్రీనివాసరావు, రాష్ట్ర రిసోర్స్ పర్సన్ పెసర ప్రభాకర్‌రెడ్డి, జల్లేపల్లి, తిరుమలాయపాలెం పాఠశాలల ప్రధానోపాధ్యాయులు దారా రాజేష్, విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

టాస్క్‌ఫోర్స్ ఏసీపీగా సత్యనారాయణ

స్పెషల్ బ్రాంచ్ ఏసీపీగా మహేష్

ఖమ్మంక్రైం : ఖమ్మం టాస్క్‌ఫోర్స్ ఏసీపీగా టి.సత్యనారాయణను, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీగా టి.మహేష్‌ను నియమిస్తూ డీజీపీ జితేందర్ ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా శనివారం 44 మంది డీఎస్పీలు బదిలీలు కాగా వెయిటింగ్‌లో ఉన్న వీరికి పోస్టింగ్ కల్పించారు. గతంలో వీరిద్దరికీ ఉమ్మడి జిల్లాలో పనిచేసిన అనుభవం ఉంది. ఇప్పటివరకు స్పెషల్ బ్రాంచ్‌కు సీసీఆర్బీ ఏసీపీ సాంబరాజు ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తుండగా, టాస్క్‌ఫోర్స్‌కు రవికుమార్ ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తున్నారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరిస్తాం

- వినియోగదారులకు త్వరలో అవగాహన సదస్సులు
- ఎస్‌ఈ శ్రీనివాసాచారి వెల్లడి



మాట్లాడుతున్న ఎస్‌ఈ శ్రీనివాసాచారి

ఖమ్మంవ్యవసాయం: విద్యుత్ సమస్యను తమ దృష్టికి తీసుకొస్తే ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరిస్తామని ఎన్పీడీసీఎల్ ఖమ్మం సర్కిల్ ఎస్‌ఈ ఇనుగుర్తి శ్రీనివాసా చారి తెలిపారు. జిల్లాలోని విద్యుత్ అధికారులు, ఉద్యోగ, కార్మిక సంఘాల ప్రతినిధులతో స్థానిక విద్యుత్ గెస్ట్‌హౌస్‌లో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యుత్ సమస్యను తెలిపేందుకు 87124 83490 నంబర్ అందుబాటులో ఉంటుందని, సమస్య వివరించడంతో పాటు సంబంధిత ఫొటోను వాట్సాప్‌లో పెట్టవచ్చని చెప్పారు. సమీప సబ్ స్టేషన్‌లో ఉండే ఫిర్యాదుల పుస్తకంలోనూ సమస్యను నమోదు చేసే అవకాశం ఉందన్నారు. ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ వైర్లు, స్తంభాలు తదితర సమస్యలు తమ దృష్టికి తేవాలని కోరారు. విద్యుత్ వినియోగం, సమస్యల పరిష్కారం వంటి అంశాలపై రైతులకు పొలంబాట, వినియోగదారులకు జూలై మొదటి వారంలో గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించనున్నట్లు తెలిపారు. కంపెనీ స్థాయిలో సమస్యల పరిష్కారానికి టోల్ ఫ్రీ నంబర్లు 1912 లేదా 1800 4250028ను సంప్రదించవచ్చని సూచించారు. సమావేశంలో ఖమ్మం టౌన్, ఖమ్మం రూరల్, వైరా, సత్తుపల్లి, ఖమ్మం ఎంఆర్‌టీ, టెక్నికల్, విజిలెన్స్ డీఈలు నంబూరి రామారావు, సీహెచ్ నాగేశ్వరరావు, బండి శ్రీనివాసరావు, ఎల్.రాములు, బాబూరావు, భద్రూ, టి.వెంకటేశ్వర్లు, ఎస్ఏఓ శ్రీధర్, ఏఓ మురళి, ఉద్యోగ, కార్మిక సంఘాల ప్రతినిధులు మందపాటి సత్యనారాయణ రెడ్డి, ఎం. ప్రసాద్, సురేష్, బీవీఎస్ మూర్తి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆర్‌అండ్‌బీలో బదిలీలు, పదోన్నతులు

ఖమ్మంఅర్బన్: రోడ్లు, భవనాల శాఖలో బదిలీలు, పదోన్నతులు చోటుచేసుకున్నాయి. జిల్లా నుంచి పాలేరు సబ్ డివిజన్ డీఈగా పనిచేస్తున్న వి.వెంకటరమణయ్య పదోన్నతిపై నారాయణపేట జిల్లాకు ఈఈగా బదిలీ అయ్యారు. హైదరాబాద్ కార్యాలయంలో పని చేస్తున్న పవార్ ఖమ్మం ఈఈగా నియమితులయ్యారు. ప్రస్తుతం ఈఈగా ఎన్‌హెచ్ విభాగంలో ఉన్న యుగంధర్ అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తుండగా ఆయన నుంచి పవార్ బాధ్యతలు స్వీకరించనున్నారు. ఇక ఎన్‌హెచ్ డీఈ బషీర్ పదోన్నతిపై ఖమ్మం డిప్యూటీ ఎస్‌ఈగా నియమితులయ్యారు. ఇప్పటివరకు ఇన్‌చార్జ్‌తో నెట్టుకొస్తున్న ఈ పోస్టు ఎట్టికేలకు పదోన్నతితో భర్తీ అయింది. జిల్లాకు కేటాయించిన ఇంజనీర్లు త్వరలో విధుల్లో చేరనున్నట్లు సమాచారం. తాజా బదిలీలతో ఆర్‌అండ్‌బీ శాఖలో పరిపాలన మార్పులు జరగనున్నాయి.

‘నివేదన’.. పరిశీలన

- డీడీఎన్ పథకానికి ఉమ్మడి జిల్లాలో 205 దరఖాస్తులు
- ఈఓలు, అర్చకులతో విచారణ కమిటీల ఏర్పాటు
- నివేదికల ఆధారంగా ఆలయాల ఎంపిక

ఖమంగాంధీచౌక్: ధూప దీప నివేదన(డీడీఎన్) పథకానికి దరఖాస్తు చేసుకున్న ఆలయాల పరిశీలన ప్రక్రియను దేవాదాయ, ధర్మాదాయ శాఖ చేపట్టింది. ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవాలని మే 1న నోటిఫికేషన్ విడుదల చేసి, అదే నెల 24వ తేదీ తుది గడువుగా నిర్ణయించింది. దీంతో ఖమ్మం, భద్రాద్రి జిల్లాల నుంచి 205 దరఖాస్తులు అందగా.. వాటిని క్షేత్ర స్థాయిలో పరిశీలించాలని ఆ శాఖ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. పరిశీలనకు ఆలయాల ఈఓలు, అర్చకులతో కమిటీ ఏర్పాటు చేయాలని కూడా పేర్కొన్నారు. ఈ మేరకు ఉమ్మడి జిల్లా దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్.. కమిటీలు ఏర్పాటు చేసి, పరిశీలన బాధ్యతలు అప్పగించారు. డీడీఎన్ నిబంధనల ఆధారంగా నియోజకవర్గాల వారీగా ఆలయాలను పరిశీలించి సమగ్ర నివేదికలు అందించాలని సూచించారు.

ఆలయాల మనుగడ కోసం..

పురాతన ఆలయాలు మనుగడ కోల్పోతుండగా వాటి పునర్ వైభవం కోసం 2007లో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి ధూప దీప నివేదన పథకాన్ని ప్రారంభించారు. ప్రస్తుతం ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని 450 ఆలయాలకు ఈ పథకం అమలువుతోంది. ఇటీవల ప్రభుత్వం విడుదల నోటిఫికేషన్ ఆధారంగా ఖమ్మం జిల్లా నుంచి 146, భద్రాద్రి జిల్లా నుంచి 59 ఆలయాల అర్చకులు కొత్తగా దరఖాస్తు చేసుకున్నారు. వీటిని దేవాదాయ, ధర్మాదాయ శాఖ నియమించిన కమిటీ పరిశీలించాక అర్హత గల ఆలయాలకు పథకం అమలయ్యే అవకాశం ఉంది.

ఉమ్మడి జిల్లాలో ఆరు కమిటీలు..

రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు.. ఎండోమెంట్ ఆలయాల్లో విధులు నిర్వహిస్తున్న ముఖ్య కార్యనిర్వహణాధికారులు, అర్చకులతో ధూప దీప నివేదన దరఖాస్తుల పరిశీలనకు కమిటీలు నియమించారు. ఖమ్మం జిల్లాలో మూడు, భద్రాద్రి జిల్లాలో మూడు కమిటీలకు ఈ బాధ్యతలు అప్పగించారు. డీడీఎన్ పథకానికి ప్రభుత్వం పలు నిబంధనలను రూపొందించింది. ముఖ్యంగా పురాతన ఆలయాలకు ప్రాధాన్యత ఇచ్చింది. ఆలయం నిర్మించి 15 ఏళ్లు నిండి ఉండాలని, దేవాదాయ శాఖలో రిజిస్ట్రేషన్ చేసి ఉండాలని, ఆలయానికి మెట్ట భూమి ఐదెకరాలు, మాగాణి భూమి 2.50 ఎకరాలకు మించి ఉండరాదని, ఆలయంలో నిత్యం అర్చకుడు దీపం వెలిగించి నివేదన చేస్తూ ఉండాలని నిబంధనల్లో పొందుపర్చారు.


నివేదిక ఆధారంగా ఎంపిక..

డీడీఎన్ పథకం దరఖాస్తుల పరిశీలనకు ఎంపిక చేసిన కమిటీలు క్షేత్ర స్థాయిలో ఆలయాలను సందర్శించి, ఆలయ చరిత్ర, ఆస్తి తదితర అంశాలను అధ్యయనం చేయాల్సి ఉంటుంది. అర్చకుడి పనితీరును కూడా పరిశీలించాలి. నిబంధనల ఆధారంగా దరఖాస్తులను కమిటీ సభ్యులు పరిశీలించి ఆలయాల వారీగా నివేదికలను దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్‌కు అందించాక ఆయన విచారణ చేసి తుది నిర్ణయం, అనుమతులను ఉన్నతాధికారులకు పంపిస్తారు. ఆ తర్వాత ఎంపికైన ఆలయాల జాబితా విడుదలవుతుంది. అర్హత సాధించిన ఆలయాలకు ప్రభుత్వం నెలకు రూ.10 వేలు అందిస్తుంది. వీటిలో రూ.6 వేలు పడితరం (ఆలయ నిర్వహణ), రూ. 4 వేలు అర్చకుడికి గౌరవ వేతనంగా చెల్లిస్తారు.



ముదిగొండ మండలం కమలాపురంలోని పార్వతీ సమేత రామలింగేశ్వర స్వామి ఆలయం

నిబంధనల మేరకు ఎంపిక చేస్తాం



నిబంధనలకు లోబడి ధూప దీప నివేదన పథకానికి ఆలయాలను ఎంపిక చేస్తాం. పరిశీలన కమిటీలు క్షేత్ర స్థాయిలో ఆలయాలను సందర్శిస్తాయి. ఈ ప్రక్రియలో దరఖాస్తుదారులు ఎవరి మాటలు నమ్మి మోసపోవద్దు. అర్హతల ఆధారంగా ఆలయాల ఎంపిక ఉంటుంది. తుది నిర్ణయం రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ తీసుకుంటుంది.

– ఎం వీరస్వామి, దేవాదాయ శాఖ ఏసీ

క్లుప్తంగా

మట్టిని తొలగించి స్థలం కబ్జా..!

పెనుబల్లి: ఎన్నెస్పీ కాల్వ ఆధీనంలోని మట్టిని అక్రమంగా తోలుకుపోవడంతో పాటు ఆ స్థలాలను ఆక్రమించే పనిలో పడ్డారు అక్రమార్కులు. ఇలాంటి ఘటన మండలంలోని సూరయ్యబంజర్ గ్రామంలో చోటుచేసుకుంది. సూరయ్యబంజర్ వద్ద ఎన్నెస్పీ కాల్వ తవ్వినప్పుడు వచ్చిన మట్టిని ఆ శాఖ స్థలంలోనే కాల్వకు ఇరువైపులా పోశారు. ఆ మట్టిని ఇటీవల కాలంలో గ్రీన్ ఫీల్డ్ హైవేకి భారీ ఎత్తున తోలుకుపోయారు. దీంతో పాటు ఆ మట్టిని పరిసర ప్రాంతాల్లోని రియల్ ఎస్టేట్ వెంచర్ల యజమానులు, ఇందిరమ్మ ఇళ్లు కట్టుకుంటున్నవారు తరలించారు. దళారులు జేసీబీ సాయంతో మట్టిని తొలిగించి, ఆ స్థలాన్ని ఆక్రమించడం ప్రారంభించారు. ఇలా సూరయ్యబంజర్‌లో మూడు ఎకరాలకు పైగా ఉన్న మట్టిని తొలగించి, ఆ స్థలాన్ని ఆక్రమించారని స్థానికులు ఆరోపిస్తున్నారు. అధికారులు సైతం చూసీచూడనట్లు వదిలేయడంతో అక్రమార్కులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అక్రమార్కులకు కాకుండా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు కూపన్లు జారీ చేసి, ఉచితంగా మట్టి ఇచ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రామయ్యకు సువర్ణ తులసీ అర్చన



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామ చంద్ర స్వామివారికి శనివారం సువర్ణ తులసీ అర్చన నిర్వహించారు. స్వామివారిని బేడా మండపంలో కొలువుదీర్చి నిత్యకల్యాణం శాస్త్రోక్తంగా జరిపారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు.

శాశ్వత నిత్యాన్నదానానికి విరాళం

శాశ్వత నిత్యాన్నదాన కార్యక్రమానికి ఏపీలోని కాకినాడకు చెందిన భక్తురాలు సత్య అనురాధ రూ.లక్ష చెక్కును ఆలయ అధికారులకు అందజేశారు. దాత కుటుంబ సభ్యులతో కలిసి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించగా, ఆలయ అధికారులు స్వామి వారి ప్రసాదంతోపాటు జ్ఞాపికను అందజేశారు.

ఆయిల్ రికవరీని కాపాడాలి

అశ్వారావుపేట/దమ్మపేట: ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీలో ఆయిల్ రికవరీని కాపాడాలని తెలంగాణ ఆయిల్‌ఫెడ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రశాంత్ కుమార్ సూచించారు. శనివారం అశ్వారావుపేట, దమ్మపేట మండలం అప్పారావుపేట పామాయిల్ ఫ్యాక్టరీలను నారంవారిగూడెంలోని ఆయిల్‌పామ్ నర్సరీని ఆయన సందర్శించారు. ఫ్యాక్టరీలో జరుగుతున్న పనులు, గెలల క్రషింగ్ సామర్థ్యంపై అధికారులతో చర్చించారు. అనంతరం మాట్లాడుతూ ఆయిల్ రికవరీ శాతం తగ్గకుండా ఉండేందుకు గెలల దిగుమతి నుంచి క్రూడాయిల్ సేకరణ వరకు అన్ని అంశాల్లో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పక్వానికి రాని గెలలను తీసుకురావొద్దని రైతులను సూచించాలన్నారు. ప్లాంట్ల మేనేజర్లు ఎం.నాగబాబు, సత్యనారాయణ, అధికారులు పవన్, కళ్యాణ్, వెంకటేష్, కార్తీక్, రాజేష్, శివ,రాధాకృష్ణ ఉన్నారు.

విజ్ఞాన గని..



1929లో భారత యువజన సంఘం పేరుతో స్థాపించిన కారేపల్లి శాఖాగ్రంథాలయం

సింగరేణి గ్రంథాలయానికి విశేష స్పందన

- స్వాతంత్ర్యానికి ముందే 1929లో ఏర్పాటు
- ఆనాడు భారత యువజన సంఘంగా నామకరణం
- ఎందరో విద్యార్థులను తీర్చిదిద్దిన గ్రంథాలయం



వార్తాపత్రికలు చదువుతున్న పాఠకులు

కారేపల్లి: సింగరేణి (కారేపల్లి) శాఖా గ్రంథాలయం ఓ విజ్ఞాన గని. ఎందరో విద్యార్థులను ఉద్యోగులుగా, మేధావులుగా తీర్చిదిద్దిన ఓ స్థావరం. ఆనాటి యువకుల స్ఫూర్తితో.. స్వాతంత్ర్యానికి ముందే 1929లో 'భారత యువజన సంఘం'గా ఏర్పాటై, నేటి యువతకు స్ఫూర్తిదాయకమై విరాజిల్లుతోంది. భారత యువజన సంఘం స్థాపనలో ఆనాటి యువకులు పర్సా రామచంద్రరావు, నేదునూరి వీరరాఘవులు ఆధ్వర్యంలో ఈ గ్రంథాలయం ఎన్నో జ్ఞాపకాలకు వేదిక అని పలువురు చెబుతుంటారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత 1986 వరకు పాత భవనమే ఉన్నప్పటికీ అనంతరం కారేపల్లి శాఖా గ్రంథాలయంగా మారి.. కొత్త భవనంలో కొనసాగుతోంది.

పోటీ పరీక్షల సన్నద్ధత కోసం..

కారేపల్లి శాఖా గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు సంబంధించిన కరెంట్ ఎఫైర్స్, కాంపిటేటివ్ బుక్స్, నవలలు, పిల్లలకు సంబంధించిన కథల పుస్తకాలు, కాకతీయులు, మొఘలులు, జైనులు, శాతావాహనుల చరిత్ర, జాతీయ నాయకుల జీవిత చరిత్ర, వీటితోపాటు, ఇతిహాసాలైన రామాయణం, మహాభారతం వంటి పుస్తకాలు, ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీ, గ్రూప్–1, గ్రూప్–2, పోలీస్, ఎంసెట్, ఎంఈడీ, టీటీసీ ప్రవేశ పరీక్షలకు సైతం ఇక్కడ పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. ఏడాది కిందటి వివిధ తెలుగు దినపత్రికలు, వార పత్రికలు, పక్ష పత్రికలు, మాస పత్రికలతో పాటు ఇంగ్లిష్, ఉర్దూ పేపర్లు అందుబాటులో ఉన్నాయి.

7,855 పుస్తకాలు, 453 సభ్యత్వాలు

కారేపల్లి శాఖాగ్రంథాలయంలో 7,855 పుస్తకాలు ఉండగా, 453 మంది పాఠకులు సభ్యత్వాలు కలిగి ఉన్నారు. తెలుగు పుస్తకాలు 6,800, ఆంగ్ల పుస్తకాలు 725, హిందీ పుస్తకాలు 309 ఉండగా, పురుషులు 306, స్త్రీలు 53, బాలురు 94 మంది సభ్యత్వాలు కలిగి ఉన్నారు. రోజువారీగా 60 – 80 మంది పాఠకులు గ్రంథాలయానికి వచ్చి చదువుకుంటారు. ఉదయం 8 నుంచి 11 గంటల వరకు, మధ్యాహ్నం 3 గంటల నుంచి 6 గంటల వరకు గ్రంథాలయం తెరిచి ఉంచుతారు. ప్రతి శుక్రవారం, ప్రతినెల రెండో శనివారం సెలవు దినాలు.

మా అందరికీ గర్వకారణం



ఆనాటి యువకుల స్ఫూర్తితో కారేపల్లి గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకొని ఎందరో విద్యార్థులు పలు ఉద్యోగాల్లో, ఉన్నత స్థానాల్లో స్థిరపడ్డారు. మరెందరికో..విజ్ఞానాన్ని పంచింది. వందేళ్ల చరిత్ర ఉన్న కారేపల్లి గ్రంథాలయ అభివృద్ధికి పాలకులు కృషి చేయాలి. 2029లో గ్రంథాలయ (భారత యువజన సంఘం) శతజయంతి ఉత్సవాలు నిర్వహించాలి.

–వాసురెడ్డి సంపత్, పాఠకుడు, కారేపల్లి

పోటీ పరీక్షల పుస్తకాలు ఉన్నాయి..



పోటీ పరీక్షలకు కావాల్సిన పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. లైబ్రరీకి వచ్చి చదువుకుంటే ఎన్నో విషయాలు తెలుస్తాయి. మా స్వగ్రామం పేరుపల్లి. 4 కిలోమీటర్ల దూరం నుంచి కారేపల్లి లైబ్రరీకి వచ్చి చదువుకుంటాను. ఇక్కడ సుమారు 7 వేల పుస్తకాలు ఉన్నాయి. జ్ఞానసముపార్జనకు కారేపల్లి గ్రంథాలయం ఎంతగానో దోహదపడుతోంది.

–యడ్లపల్లి శ్రీనివాస్, పాఠకుడు, పేరుపల్లి

పాఠకుల నుంచి స్పందన



గ్రంథాలయంలో 7,855 పుస్తకాలు, 10 దినపత్రికలు, 2 ఆంగ్ల పత్రికలు, 2 వారపత్రికలు, ఒక పక్ష పత్రిక, 15 మాసపత్రికలతోపాటు పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేందుకు పుస్తకాలు ఉండటంతో పాఠకుల నుంచి స్పందన ఉంది. 453 సభ్యత్వాలు ఉన్నాయి. పెద్దవారికి రూ.100, పిల్లలు రూ.50 డిపాజిట్ చేసి సభ్యత్వం పొందవచ్చు.

–ఎండీ ఇమామ్, లైబ్రేరియన్, కారేపల్లి శాఖాగ్రంథాలయం

మార్కెట్ కార్మికుల రేట్లపై సమావేశం



మాట్లాడుతున్న మార్కెట్ కమిటీ చైర్మన్ హన్మంతరావు

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో పనిచేసే వివిధ వర్గాల కార్మికుల రేట్ల పెంపు అంశంపై శనివారం మార్కెట్ కమిటీ చైర్మన్ యరగర్ల హన్మంతరావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. రెండేళ్లకు ఒకసారి మార్కెట్ కార్మికుల కూలీ రేట్ల పెంపు ప్రక్రియ ఉంటుంది. కార్మిక సంఘాల ప్రతినిధులు ఈ ఏడాది తమకు 25 శాతం రేట్లు పెంచాలని కోరుతూ మార్కెట్ కమిటీకి, ఖమ్మం చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధి వర్గానికి వినతిపత్రాలు అందించారు. సమావేశంలో కార్మిక సంఘాల ప్రతినిధులు పెరిగిన నిత్యావసర ధరలకు అనుగుణంగా తమ కూలీ రేట్లు పెంచాలని ప్రతిపాదన చేశారు. రైతు సంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ.. ఈ ఏడాది మిర్చితో పాటు మార్కెట్‌కు విక్రయానికి వచ్చే పంటలకు ధరలు లేకపోగా, గత ఏడాదితో పోలిస్తే ధరలు తగ్గాయని వివరించారు. పంటల ధరలు తగ్గినందున కార్మికుల రేట్లు పెంపు సమంజసం కాదని వివరించారు. రైతు సంఘాల ప్రతినిధుల అభ్యర్థనకు కార్మిక సంఘాల నేతలు సుముఖత వ్యక్తం చేశారు. జరిగిన చర్చ వివరాలను జిల్లా అదనపు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి ఆయన ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని మార్కెట్ కమిటీ స్పష్టం చేసింది. సమావేశంలో మార్కెట్ కమిటీ ఉన్నత శ్రేణి కార్యదర్శి ప్రవీణ్‌కుమార్, రైతుసంఘాల ప్రతినిధులు అడపా రామకోటయ్య, మాదినేని రమేశ్, దొండపాటి రమేశ్, షేక్ మీరా, నాగేశ్వరరావు, శేఖర్ గౌడ్, రవీందర్, యుగంధర్‌నాయుడు, ఖమ్మం చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్ష, కార్యదర్శులు చిన్ని కృష్ణారావు, మెంతుల శ్రీశైలం, దిగుమతి శాఖ అధ్యక్ష, కార్యదర్శులు దిరిశాల చిన్న వెంకటేశ్వర్లు, ముత్యం ఉప్పల్‌రావు, హమాలీ, రెల్లుడు, స్వీపర్ల సంఘాల ప్రతినిధులు బండారు యాకయ్య, భూక్యా శ్రీనివాస్, మద్ది సత్యం, దడవాయి సంఘం బాధ్యులు నీలం రాజేశ్, సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

కళలను ప్రోత్సహించడం మనందరి బాధ్యత



మాట్లాడుతున్న సీఈ శ్రీనివాసబాబు

పాల్వంచ: కళలను ప్రోత్సహించడం మనందరి బాధ్యత అని కేటీపీఎస్ 7వ దశ సీఈ పి.శ్రీనివాసబాబు అన్నారు. శనివారం స్థానిక కేటీపీఎస్ సీతారామ కల్యాణ మండపంలో పాకాలపాటి కృష్ణయ్య సాంస్కృతిక కళాపీఠం సమక్షాన తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ, సంగీత నాటక అకాడమీ హైదరాబాద్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించనున్న సాంస్కృతిక కార్యక్రమాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. తెలంగాణ ఉద్యమంలో కళాకారుల పాత్ర కీలకమైందని అన్నారు. చిన్నప్పటి నుండే కళలపై మక్కువ పెంచుకునేలా కృషి చేయాలని, కళాకారుల ఆదరించి ప్రోత్సహించాలన్నారు. అనంతరం నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకురాలు తోట దేవీప్రసన్న, మధిర రంగ స్థల కళాకారుల సమైఖ్య అధ్యక్షులు పుతుంబాక కృష్ణ ప్రసాద్, బాబులాల్, ఎస్‌వీఆర్‌కే.ఆచార్యులు, వెంకటాచారి, జోన్నాడ కృష్ణ, ముత్యాల హనుమంతరావు, కృష్ణ, వెంకన్న, రోశయ్య చౌదరి, బాషా, పాకాలపాటి రోశయ్య చౌదరి, దామోదర్‌రావు, బాలస్వామి, పున్నయ్య పాల్గొన్నారు.

సోషలిజం కోసం సీఐటీయూ పోరాటం



మాట్లాడుతున్న ఎం.సాయిబాబు

ఖమ్మంఅర్బన్: దేశంలో ఆర్థిక అసమానతలు లేని సమసమాజం, సోషలిజం స్థాపనే సీఐటీయూ లక్ష్యమని, కార్మిక వర్గాన్ని ఐక్యం చేసి పెట్టుబడిదారుల పాలనకు వ్యతిరేకంగా పోరాటాలు కొనసాగిస్తామని సీఐటీయూ జాతీయ కోశాధికారి ఎం.సాయిబాబు పేర్కొన్నారు. శనివారం యన్రా శ్రీకాంత్‌నగర్ సత్తెనపల్లి రామకృష్ణభవన్ లో నిర్వహించిన సీఐటీయూ ఖానాపురం హవేలీ మండల మహాసభలో తొలుత సంఘం జెండా ఆవిష్కరించాక ఎం.సాయిబాబ మాట్లాడారు. దేశ సంపదను సృష్టించేది కార్మిక వర్గమే అయినా, దానిని కొద్దిమంది పెట్టుబడిదారులు కబ్జా చేస్తున్నారని, కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్‌లుగా కేంద్రం తీసుకొచ్చిందని, ఈ కుట్రలను తిప్పికొట్టేందుకు కార్మికులు ఐక్యంగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. సంఘం జిల్లా అధ్యక్షుడు తుమ్మ విష్ణువర్ధన్, కార్యదర్శి కళ్యాణం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. జూలై 9న చేపట్టనున్న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. మహాసభలో మహిళా విభాగం జిల్లా కన్వీనర్ పిన్నింటి రమ్యతోపాటు ఎం.తిరుమలాచార్యులు, వై.విక్రమ్, దొంగల తిరుపతిరావు, భూక్య శ్రీనివాస్, గాలి వెంకటాద్రి, గొర్రెముచ్చు నాగేశ్వరరావు, గాలి అంజయ్య, కర్ల వీరస్వామి, వేదగిరి మురహరి, మాచర్ల గోపాల్, నల్లమల సత్యనారాయణ, కుర్రి వెంకటస్వామి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఖానాపురం హవేలీ మండల సీఐటీయూ కన్వీనర్‌గా గాలి అంజయ్య, కోకన్వీనర్‌గా కర్ల వీరస్వామి తోపాటు సభ్యులను ఎన్నుకున్నారు.

ప్రభుత్వ భూమి స్వాధీనం

హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసిన రెవెన్యూ అధికారులు



హెచ్చరిక బోర్డు పెట్టిస్తున్న తహసీల్దార్, ఆర్‌ఐ తదితరులు

ఖమ్మంఅర్బన్: ఖమ్మం రెవెన్యూ పరిధి మోతీనగర్ ప్రాంతం సర్వే నంబర్ 123లో ఉన్న సుమారు 9 కుంటల (1,100 గజాలు) భూమిని రెవెన్యూ అధికారులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. స్థలం చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటుచేసి, హెచ్చరిక బోర్డు పెట్టారు. ఈ స్థలం విషయంలో రెండు వర్గాల మధ్య రెండు నెలలుగా వివాదం జరుగుతోంది. ఇది రెవెన్యూ అధికారుల వద్దకు చేరడంతో వారు సర్వే చేయగా ప్రభుత్వ భూమి అని తేలింది. దీంతో తహసీల్దార్ సైదులు, ఆర్‌ఐ సాయినరేశ్ ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది, పోలీసుల సమక్షంలో భూమిని స్వాధీనం చేసుకుని, చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసి, ప్రభుత్వ భూమి అని బోర్డులు ఏర్పాటు చేశారు. దీనిని వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటేందుకు కార్పొరేషన్ అధికారులకు అప్పగించారు.

మాకు న్యాయం చేయండి..



న్యాయం చేయాలని కోరుతున్న శైలజ, ఆమె కుమారుడు

కారేపల్లి: 'నా భర్త వేరే మహిళతో సహజీవనం చేస్తూ నన్ను, నా కుమారుడిని ఇంట్లో నుంచి గెంటేశాడు. నాకు, నా కుమారుడికి న్యాయం చేయండి' అని ఓ వివాహిత ప్రాధేయపడింది. బాధితురాలు శనివారం విలేకరులతో తెలిపిన వివరాలు.. మాధారం గ్రామానికి చెందిన శైలజ, అదే గ్రామానికి చెందిన ఏనుగు శివయ్య 16 ఏళ్ల కిందట ప్రేమించి కులాంతర వివాహం చేసుకున్నారు. వీరికి 15 ఏళ్ల కుమారుడు ఉన్నాడు. కాగా, శివయ్య వేరే మహిళతో సహజీవనం చేస్తూ, శైలజను కొట్టి ఇంట్లో నుంచి వెళ్లగొట్టాడు. ఈ ఘటనపై శైలజ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. శివయ్యను మందలించి వదిలేశారు. అయినా తీరుమార్చుకోని శివయ్య అదే మహిళతో ఉంటూ తమను వదిలించుకోవడం కోసం చిత్ర హింసలు పెడుతున్నాడని శైలజ కన్నీటి పర్యంతమైంది. శివయ్య తన పేరుతో ఉన్న రెండు ఎకరాల భూమిని విక్రయించి, తనకు, తన కుమారుడికి అన్యాయం చేయాలని చూస్తున్నాడని, స్థానిక తహసీల్దార్, కారేపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశానని ఆమె పేర్కొంది. మాధారం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ తన ప్రోద్బలంతో మంత్రుల పేర్లు చెప్పి తన భర్తను పోలీస్ స్టేషన్ నుంచి విడిపించుకుపోయాడని, తనకు, తన కుమారుడికి న్యాయం చేయాలని ఆమె వేడుకుంటోంది.

రాష్ట్ర కబడ్డీ జట్టు వైస్‌కెప్టెన్‌గా హనీ



మధిర: మధిర పట్టణానికి చెందిన హనీ రాష్ట్ర కబడ్డీ జట్టుకు వైస్‌కెప్టెన్‌గా ఎంపికైంది. ఖమ్మం సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్న హనీ 8వ తరగతి నుంచే కబడ్డీ పోటీల్లో ప్రతిభ చూపుతోంది. ఇప్పటికే జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయిలో విజేతగా నిలిచిన జట్టులో భాగస్వామిగా ఉంది. శనివారం నుంచి ఉత్తరాఖండ్‌లో మొదలైన 5వ జాతీయ బాలికల కబడ్డీ పోటీల్లో అండర్–18 విభాగం తెలంగాణ రాష్ట్ర కబడ్డీ జట్టుకు హనీ వైస్‌కెప్టెన్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తోంది. కాగా, తొలిరోజు పోటీల్లో తెలంగాణ జట్టు కేరళ రాష్ట్ర జట్టుపై విజయం సాధించింది. ఇంకా ఫైనల్ మ్యాచ్ జరగాల్సి ఉంది.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసం

చింతకాని: మండలంలోని వందనం, రామకృష్ణాపురం గ్రామాల సమీపంలోని వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేసి వాటిలోని రాగి వైరును అపహరించినట్లు విద్యుత్ ఏఈ చావా శ్రీధర్ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఫిర్యాదు చేశారు. అలాగే రేపల్లెవాడ గ్రామంలో గుర్తు తెలియని వాహనం ఢీకొనటంతో తొమ్మిది విద్యుత్ స్తంభాలు విరిగిపోయినట్లు కూడా ఫిర్యాదులో తెలిపారు. ఎస్‌ఐ నాగుల్‌మీరా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బైక్ పైనుంచి పడి గాయాలు



గాయపడిన పుట్టా రాంబాబు

బోనకల్: మండలంలోని చిన్నబీరవల్లి క్రాస్ రోడ్డు సమీపంలో మధిర మండలం సిద్ధినేని గూడెం గ్రామానికి చెందిన పుట్టా రాంబాబు ద్విచక్ర వాహనం పైనుంచి ప్రమాదవశాత్తు కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడికి 108 సిబ్బంది కోటా భానుహాసన్, మిథున్‌చక్రవర్తి ప్రథమ చికిత్స చేసి మధిర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

హాస్టల్లో ఉండలేక విద్యార్థిని ఆత్మహత్య

తల్లాడ: ఖమ్మంలోని ఓ ప్రైవేట్ కళాశాల హాస్టల్లో ఉండటం ఇష్టం లేక ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన మండలంలోని రామానుజవరంలో శనివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ఐలూరి పూజిత (16)ను తల్లిదండ్రులు ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్మీడియట్‌లో చేర్పించారు. విద్యార్థిని ఆదివారం పుట్టినరోజు జరుపుకుని, సోమవారం కళాశాలకు వెళ్లాల్సి ఉంది. కానీ, శుక్రవారం రాత్రి పురుగులమందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను ఖమ్మంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. పూజిత తండ్రి రామకృష్ణారెడ్డి ఫిర్యాదు మేరకు తల్లాడ హెడ్ కానిస్టేబుల్ చెన్నారావు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో 14 ప్రసవాలు

ఖమ్మంవైద్యవిభాగం: జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి, కళాశాలలోని మాతా శిశు కేంద్రంలో శనివారం మధ్యాహ్నం వరకు వైద్యులు 14 ప్రసవాలు చేశారు. ఇందులో ఎనిమిది సహజ ప్రసవాలు కాగా.. ఆరు సిజేరియన్ చేశారు. వీరిలో నలుగురు మగ శిశువులు, పదిమంది ఆడశిశువులు ఉన్నారని, తల్లీబిడ్డలు క్షేమంగా ఉన్నారని వైద్యులు వెల్లడించారు.

రైలు నుంచి జారిపడి సాధువు మృతి



సాధువు మృతదేహం

చింతకాని: చింతకాని రైల్వేస్టేషన్ సమీపంలో గుర్తుతెలియని రైలు నుంచి ప్రమాదవశాత్తు జారిపడి కేరళ రాష్ట్రంలోని త్రిస్సూర్‌కు చెందిన సాధువు శ్రీబిన్ కేఎస్ (38) మృతి చెందిన ఘటన శనివారం చోటుచేసుకుంది. రైల్వే పోలీసుల కథనం ప్రకారం.. సాధువు వద్ద గోరఖ్‌పూర్ నుంచి త్రిస్సూర్‌కు వెళ్లే రైలు టికెట్ ఉన్నట్లు తెలిపారు. ఫుట్‌బోర్డుపై ప్రయాణిస్తూ ప్రమాదవశాత్తు జారిపడి మరణించి ఉంటాడని రైల్వే పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని అన్నం ఫౌండేషన్ చైర్మన్ అన్నం శ్రీనివాసరావు బృందం ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించింది. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి అమ్ముతున్న యువకుల అరెస్ట్

ఖమ్మంక్రైం: ఆంధ్రప్రదేశ్‌లోని రాజమండ్రి నుంచి గంజాయి తీసుకొచ్చి ఇతరులకు అమ్ముతూ, సేవిస్తున్న యువకులను వన్‌టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. సీఐ కరుణాకర్ కథనం ప్రకారం.. నిజాంపేట ప్రాంతానికి చెందిన వినీత్, హేమంత్‌సాయితోపాటు మరో ఇద్దరు గంజాయి విక్రయించడంతో వారూ సేవిస్తున్నారు. ఈ క్రమంలో పోలీసులు దాడి చేసి, వారిని అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి 250 గ్రాముల గంజాయితోపాటు రూ.10వేలు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని సీఐ వెల్లడించారు.